ఓవైపు వర్షం.. మరో వైపు రోడ్లు ఛిద్రం

ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు.. తాత్కాలిక ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదాలు


శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వైపు రోడ్డు దుస్థితి


మాదాపూర్ ఫైర్ సర్వీసు రోడ్డు వద్ద గోతులు పడ్డ రోడ్లు


ఎస్‌బీఐ వద్ద నిలిచిన నీరు


ఎస్పీఆర్ హిల్స్ ప్రధాన రహదారి పరిస్థితి


మాదాపూర్ మెట్రో పిల్లర్ నెంబరు 1739 వద్ద రోడ్డు పై నిలిచిన నీరు

బంజారాహిల్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో భారీ వర్షాలు కురుస్తాయని గతంలోనే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నత స్థాయి సమావేశాలు సైతం నిర్వహించారు. అయితే క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయకపోగా అస్తవ్యస్తంగా తయారయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో వరుస వర్షాల నేపథ్యంలో వాహన చోదకులు అనేక అవస్థలు పడుతున్నారు. హైటెక్ సిటీ, మాదాపూర్, అయ్యప్ప సొసైటీలో ఐదు ఫీట్ల మేర పెద్ద పెద్ద గోతులు పడటంతో వాటిపై ప్రయాణిస్తూ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14లో పైప్‌లైన్ వేసి రోడ్డు వేయకుండా వదిలేశారు. ఫలితంగా వాహన చోదకులు అనేక అవస్థలు పడుతున్నారు. శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారిలో అడుగడుగునా రోడ్లపై వరద నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పరిస్థితి చేయి జారకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.


కార్మికనగర్‌లో గోతులు పడ్డ రోడ్డు


శ్రీనగర్‌కాలనీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై నిలిచిన వరద నీరు

మహిళల రక్షణ కోసం పోష్ చట్టం

మీడియా ప్రతినిధుల అవగాహన కార్యక్రమంలో వక్తలు

పంజాగుట్ట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమకు సంబంధించిన చట్టాలు, హక్కుల గురించి తెలుసుకోవాలని వక్తలు సూచించారు. పని, ఉద్యోగ ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని వారి రక్షణ కోసం పనిచేసే ప్రదేశాలలో మహిళలపై వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార (పోష్)చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని వారు గుర్తు చేశారు. ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్ (ఇండియా) ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోష్ యాక్ట్ పై మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు వనజ, రిసోర్స్ పర్సన్, న్యాయవాది సుభాషిణి, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి వందన, తదితరులు పని, ఉద్యోగ ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి ఎలా రక్షించుకోవాలి, తమకు జరిగిన అన్యాయంపై ఎవరికి ఫిర్యాదు చేయాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోష్ యాక్ట్ ఏమి చెప్పుతుందో వారు వివరించారు. పని, ఉద్యోగ ప్రదేశాలలో మహిళలను వేధించడం శిక్షార్హమైన నేరమని, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టిద్దామని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో అయినా పది మంది కన్నా ఎక్కువ మహిళలు పని చేస్తుంటే అక్కడ పనిచేసే వారు ఇబ్బందులు ఎదుర్కొంటే ఫిర్యాదు చేయడానికి తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీ వేయాలని తెలిపారు. లీగల్ కంప్లైంట్ కమిటీ కూడా ఎప్పటికప్పుడు వారికి సమాచారం అందిస్తూ ఉండాలని అన్నారు. పోష్ యాక్ట్ పై అనుమానాలను వారు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో మీడియా, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, చిత్రంలో ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు

81 మంది మహిళలకు కుట్టుమిషన్లు

ఖైరతాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు సీతయ్య గుప్త జయంతి సందర్భంగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు జరిగాయి. స్వయం ఉపాధి నిమిత్తం 81 మంది మహిళలకు కుట్టుమిషన్లు, 500 మంది వృద్ధులకు పింఛన్లు, 125 మందికి 10 కిలోల చొప్పున బియ్యం, కొందరికి గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, పారిశ్రామికవేత్త బండారు సుబ్బారావు తదితరులతో కలిసి పేదలకు పరికరాలను పంపిణీ చేశారు.


బోరబండలో జల్సా ఎ ఆమ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్ద

బోరబండలో ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలి

బోరబండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బోరబండ ప్రాంతంలోని ముస్లింల కోసం ఖబరస్తాన్ ఏర్పాటు చేయాలని పలువురు ముస్లిం మత పెద్దలు కోరారు. బోరబండ సైట్-3 కాలనీ ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాలులో హాలాత్ ఎ హాజెరా (ప్రస్తుత పరిస్థితి) అంశంపై జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బోరబండలో మసీదులు అనేకం ఉన్నా.. ఖబ్రస్తాన్ లేదని తెలిపారు. ముస్లింల అంత్యక్రియల కోసం అవస్థ పడాల్సి వస్తోందని చెప్పారు. 15ఏళ్ల నుంచి వక్ఫ్ బోర్డుతో పాటు ప్రభుత్వంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమీర్ మిల్లత్ ఎ ఇస్లామియా సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి హజరత్ మౌలానా జాఫర్ పాషా, జమాత్ ఎ ఇస్లామి హింద్ తెలంగాణ అధ్యక్షులు హజరత్ మౌలానా హామీద్, బోరబండ ప్రాంతంలోని వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు, బోరబండ ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు.


పూర్వ విద్యార్థులకు పాఠం చెబుతున్న అప్పటి తెలుగు టీచర్ హైమావతి

గుర్తుకొస్తున్నాయి..

ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజాగుట్ట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం, 50 వసంతాల వేడుక ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. 1975లో పదవ తరగతి చదివిన సుమారు అరవై మంది పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదవ తరగతి చదివి 50 ఏళ్లయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలో చిన్నపిల్లల్లా వారు సందడి చేశారు. ప్రత్యేక టీ షర్ట్ ధరించారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి తెలుగు టీచర్ హైమావతి విద్యార్థులందరినీ క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టి సరదాగా పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. అప్పుడు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రతీ సంవత్సరం కలుసుకోవాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రతినిధులు కె.బాలాజీ, పి.శంకర్, శేషాద్రి, జీకే. కుమార్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వీధికుక్క దాడి

- ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స, గాంధీకి తరలింపు

బర్కత్ పుర ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వచ్చిన వృద్ధురాలిపై వీధి కుక్క దాడిచేసింది. దీంతో ఆమె కుడికాలు పిక్కపై తీవ్ర గాయం అయింది. ఫీవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ జగదేవ్‌పూర్‌కు చెందిన డి.సిద్ధమ్మ(90) శనివారం కుటుంబసభ్యులతో కలిసి యాప్రాల్‌లోని బాలాజీనగర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చింది. ఆ వృద్ధురాలు చేతి కర్రను పట్టుకొని వీధిలోకి వచ్చింది. అక్కడ ఉన్న ఓ వీధి కుక్క వృద్ధురాలిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. కుడికాలి పిక్కపై కరవడంతో లోతైన గాయమై, తీవ్రరక్తస్రావం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చేర్పించారు. కుక్కకాటు గాయాన్ని శుభ్రం చేసిన వైద్యులు ఇంజక్షన్‌తో పాటు, రిగ్ వ్యాక్సిన్ ఇచ్చారు. పిక్కపై మాంసం ముద్ద తెగిపోయి గాయం పెద్దగా ఉండడంతో ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు ఆ వృద్ధురాలని ఆదివారం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఎం.చిన్ననాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(35) బుద్వేల్ - శివరాంపల్లి రైల్వే స్టేషన్ నడుమ ఆరాంఘర్ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

కూల్చిన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించేలా చూడాలి

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో రెవెన్యూ అధికారులు కూల్చిన పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని తిరిగి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బస్తీ వాసులు, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి ఆదివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా చిన్నపాటి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నట్టు చెప్పారు.

ఇటీవలె రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమంటూ ఆలయాన్ని కూల్చివేయడంతో పాటు విగ్రహాన్ని మరో ఆలయానికి తరలించారని చెప్పారు. ఆలయ సందర్శనకు వెళ్లిన వారిపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. వెంటనే ఆలయాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకునేందుకు త్వరలోనే అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు మేచినేని శ్రీనివాస్, కరాటే కళ్యాణి తదితరులు ఉన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, మేచినేని శ్రీనివాస్ తదితరులు

బీజేపీలో చేరికలు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ బీజేపీ నాయకుడు రాగుల సాయి కృష్ణ ఆధ్వర్యంలో 100 మంది యువకులు, మహిళలకు కేంద్రమంత్రి పార్టీ కండువాలు కప్పి చేర్చుకున్నారు. డివిజన్‌కు చెందిన పలువురు యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో చేరారు.

ఎన్టీఆర్ మార్గంలో కారు బీభత్సం

ఖైరతాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గంలో మరో కారు హంగామా సృష్టించింది. ఆదివారం తెల్లవారు జామున తెలుగుతల్లి ఫ్లైఓవర్ నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ వైపు వెళ్తున్న పోలో కారు ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైనున్న చెట్టును ఢీకొని అంతే వేగంతో తిరిగి రోడుపైకి వచ్చింది. కారు ముందు భాగం దెబ్బతిన్నా- అదృష్టవశాత్తు కారు నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దమ్మాయిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వంశీకృష్ణ కారు నడుపుతూ అదుపుతప్పాడని సైఫాబాద్ ఇనిస్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. నిర్లక్ష్యంగా, వేగంగా కారు నడపడంపై డ్రైవర్ వంశీకృష్ణపై పెట్టీకేసు నమోదు చేశారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

వేర్వేరు చోట్ల రెండు ద్విచక్ర వాహనాలు మాయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలలో ఇంటి ముందు నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలు మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ రవి కుమార్ వివరాల ప్రకారం.. ద్వారకామయి అపార్ట్మెంట్, గణపతి కాంప్లెక్స్ సమీపంలో నాదంపల్లి శ్రీనివాస్ రాజు వాహనాన్ని తన ఇంటి ముందు పార్క్ చేసి తర్వాత ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా వాహనం మాయమైందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా కృష్ణానగర్ కు చెందిన వై.మల్లేష్ తన స్నేహితుడి ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేసి బయటకు వెళ్లి వచ్చే వరకే బండి మాయమైందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డేటా, బహుళ కంప్యూటర్లు మాయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సినిమా కార్యాలయంలోకి చొరబడి డేటా, బహుళ కంప్యూటర్లను ఎత్తుకెళ్లిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ చెందిన కొరివి వెంకట నారాయణ రెడ్డి ఓ చిత్ర నిర్మాణంలో రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆ సినిమాలో సృజనాత్మకత లేదని, వ్యాపార భాగస్తులతో విభేదించి ఆ చిత్ర నిర్మాణం నుంచి వైదొలిగారు. ఆదూరి ఉమామహేశ్వర రెడ్డి, టి.నవీన్ కుమార్ రెడ్డి, సాయి, మరొకరు మధురానగర్ శ్రీ సాయి బాలాజీ నిలయంలో ఉన్న కార్యాలయంలోకి చొరబడి డేటా, కంప్యూటర్, సినిమా కథల స్క్రిప్టులతో పాటు విలువైన సామగ్రిని ఆదివారం ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం: అంజన్ కుమార్


బోరబండలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్ యాదవ్

బోరబండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడటం ఖాయమని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాడి అంజన్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బోరబండ సైట్-2 కాలనీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధిష్ఠానం అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించినా భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేయవలసిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని చెప్పారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎం.డి.మోసిన్ ఖురేషి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, సైట్-2 కాలనీ అధ్యక్షుడు కె.శివకుమార్, వివిధ బస్తీల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ వైభవం కోసం కృషి

ఎర్రగడ్డ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నామని అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ, ఉపఎన్నికలలో పార్టీని గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. కళ్యాణ్ నగర్‌లోని హిమకీర్తి అపార్ట్‌మెంట్ వాసులను, అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కోరారు.

దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి: కిలారి


విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ మనోహర్

వెంగళరావునగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రమాదం సంభవించిక ముందే దెబ్బతిన్న, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వెంగళరావు నగర్ డివిజన్ యాదగిరి నగర్ బస్తీలో సిమెంట్ విద్యుత్ స్తంభం కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఆయన బస్తీలో పర్యటించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డివిజన్‌లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన కోరారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యదర్శి సుప్రియ గౌడ్, బి.రూప, తదితరులు ఉన్నారు.

ధర్మస్థలం హత్యలు ఘోరం: శ్రీధర్


మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ కేంద్ర కమిటీ సభ్యుడు శ్రీధర్


ఖైరతాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ) వ్యవస్థాపకులు, ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త శిబ్దాస్ ఘోష్ 49వ వర్ధంతి సందర్భంగా సైఫాబాద్ సామ్రాట్ కాంప్లెక్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఇందులో ఎస్‌యూసీఐ కేంద్ర కమిటీ సభ్యుడు కె.శ్రీధర్ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ, దేశంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఘోరాలు, నేరాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇటీవలే ధర్మస్థలంలో వెలుగుచూసిన దారుణ హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. ఇలాంటి సమస్యలను ఎదుర్కోగలిగే శాస్త్రీయ సిద్ధాంతాన్ని శిబ్దాస్ ఘోష్ పార్టీకి అందించారన్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్యాపిటలిస్టు దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను మిలిటరైజ్ చేసి యుద్ధభయం పెంచి ఆయుధ బడ్జెట్‌లను పెంచాయని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి మాట్లాడుతూ, శిబ్దాస్ ఘోష్ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు, ఆ వర్గ పార్టీలకు దిక్సూచిగా మారాయన్నారు. ఇందులో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగాధర్, రాష్ట్ర జిల్లాల కార్యవర్గ సభ్యులు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.


బోనాలు సమర్పించేందుకు వెళుతున్న మహిళా భక్తులు, నర్సింగరావు

18 బస్తీల నుంచి అమ్మవారికి బోనాలు

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస బోనాలు ఆదివారం ఫిలింనగర్ రోడ్డు నెంబరు 46, అంబేద్కర్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 బస్తీల నుంచి మహిళలు అమ్మవారికి బోనం సమర్పించారు. పోతరాజు వీరంగాలతో ఆలయంలో సందడి నెలకొంది. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్

మాల సామాజిక వర్గంపై చిన్నచూపు: భాస్కర్

పంజాగుట్ట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మాల సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూస్తోందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాలలకు రిజర్వేషన్లు తీసివేసిందని వక్తలు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత మాలలకు విద్య, ఉద్యోగ రంగాలలో రోస్టర్ విధానం వలన తీవ్ర అన్యాయం జరుగుతోందని వారన్నారు. చట్టంలోని లోపాలు సవరించకుంటే, రోస్టర్ విధానాన్ని సరి చేయకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఎస్సీ వర్గీకరణ వలన మాల, మాల అనుబంధ కులాలకు జరుగుతున్న అన్యాయంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రామచందర్, చీఫ్ కో ఆర్డినేటర్ తాళ్లపల్లి రవి, కార్యనిర్వాహక చైర్మన్ మంత్రి నర్సింహ, భీమ్ సేన్, కన్వీనర్ ఎన్.కనకరాజు,మాల మేధావులు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.


రాష్ట్రవ్యాప్త సభ్యత్వ నమోదు కార్డులను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, తదితరులు

బలం, బలగాన్ని చాటుతాం: దేవయ్య పటేల్

పంజాగుట్ట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమగ్ర కులగణనలో మున్నూరుకాపుల జనాభాను తక్కువ చేసి చూపించిందని, రాష్ట్ర వ్యాప్తంగా తమ కుల సభ్యత్వ నమోదుతో తమ బలం, బలగాన్ని చాటుతామని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) రాష్ట్ర అధ్యక్షుడుకొండా దేవయ్య పటేల్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వ్యాప్త సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ముందుగా కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి, బీసీల నేత పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్న మున్నూరు కాపులను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా తక్కువ చేసి చూపించిందన్నారు. ఈ సమావేశంలో సంఘం గ్రేటర్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రాజేశ్, సతీశ్, వెంకటేశ్ పటేల్, నిరంజన్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఇనిస్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్ తదితరులు - ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)

ఘనంగా శ్రావణమాస బోనాలు



కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు పరిధిలోని బాలాజీ కాలనీలో ఉప్పలమ్మ తల్లి, జడల మైసమ్మ తల్లి దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



కాకాగూడలోని అమ్మవారికి బోనం సమర్పించడానికి వచ్చిన కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ జె.అనురాధ రామకృష్ణ



నల్లగుట్టలోని త్రిపుర సుందరి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, తదితరులు



అమ్మవారికి పూజలు చేస్తున్న రాఘవ రెడ్డి, జంపన ప్రతాప్, తదితరులు



న్యూ బోయిగూడలో పూజల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

పద్మారావునగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): న్యూ బోయిగూడలో ఆదివారం నిర్వహించిన బోనాల జాతర, పూజా కార్యక్రమాల్లో బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి కల్లు కంపౌండ్ చౌరస్తాలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్థివాడ, ఉప్పలమ్మ ఆలయం, ఏడు పాయల ఆలయం, సీసీనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, చంద్రపాల్, వికాస్, మంచాల గోపి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డు-7 తిరుమలగిరి లోని గన్‌రాక్ టీచర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం శ్రావణ మాస బోనాల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

● శ్రావణమాస బోనాలు ఆదివారం తిరుమలగిరి ఆర్టీసీ కాలనీ లాల మియా బస్తీలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. జయలక్ష్మీ గార్డెన్ అధినేత రాఘవ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వీరిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

మారేడుపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్‌బోర్డు ఐదవ వార్డు పరిధిలోని కాకాగూడలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ, అనురాధ దంపతులు పాల్గొన్నారు. కాకాగూడలోని పలు ఆలయాల్లోని అమ్మవార్లకు కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ జే.అనురాధ బోనం సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, శంకర్, పరశురామ్, గణేష్, దినేష్, లక్ష్మణ్, కుమార్, మహేష్, సోనూ, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.



కళాసిగూడలో జూలమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ కొళికే కిరణ్మయి. బీఆర్ఎస్ నాయకులు కిషోర్ కుమార్, సిరికొండ చందు చారి తదితరులు



గాలి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్. గృహ సముదాయం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాతంగి గణేష్, నాయకులు కోటేశ్వర్ గౌడ్



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు పరిధిలోని రాంగోపాల్ ఎన్‌క్లేవ్‌లో రూ20 లక్షల కంటోన్మెంట్ బోర్డు నిధులతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమాన్ని సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదివారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోకాలంగా స్థానిక కాలనీవాసులు ఎదురుచూస్తున్న డ్రైనేజీ నూతన పైప్‌లైన్ నిర్మాణం పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అనంతరం కాలనీ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ మానయ్య, శ్రీధర్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ప్రతీక్ జైన్, సీనియర్ నాయకులు బాణాల శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు రమేష్ రెడ్డి, సుకుమార్, శ్రీధర్, ప్రసాద్, శారద, రాజకన్య గడియ తదితరులు పాల్గొన్నారు.



తాడ్‌బండ్ దేవాలయంలో ప్రభుత్వ వాహనానికి పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

తాడ్‌బండ్ దేవాలయంలో వాహన పూజ

బోయినపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ దేవాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదివారం ప్రభుత్వం ఆయనకు కేటాయించిన నూతన వాహనంతో పాటు, కాన్వాయ్ వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అనంతరం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ఎంతో మహిమ కలిగిన దేవాలయంలో తన అధికారిక వాహనానికి పూజలు చేయించడం ఆనందం కలిగించిందన్నారు. అయితే తనకు మంత్రి పదవి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం కేటాయించిన వాహనానికి పూజలు చేయడానికి సరైన ముహూరత్తం లేనందువల్లనే ఈ రోజు పూజలు చేయించినట్లు మంత్రి తెలిపారు.

ఘనంగా కనకదుర్గ దేవాలయ వార్షికోత్సవం

బోయినపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మార్కెట్ యార్డు వద్ద ఉన్న కనకదుర్గ దేవాలయం 11వ వార్షికోత్సవం బోయినపల్లి రిటైల్ మార్కెట్ అసోసియేషన్ చైర్మన్ మక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అభిషేక పూజలు, హోమాలు, మహా హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారస్థులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణ

చినుకుపడితే చిత్తడే

● కాలు బయట పెట్టలేని పరిస్థితి
● మురుగు ప్రవహించక దుర్గంధం
● ప్రబలుతున్న అంటువ్యాధులు
● అల్లాడిపోతున్న ప్రజలు

బోయినపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్న వర్షం పడిందంటే చాలు కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఆరవ వార్డు బోయినపల్లిలోని మర్రి రామ్‌రెడ్డి కాలనీ, గణేష్ నగర్, సీతారాంపురం, శ్రీనివాస్ నగర్ కాలనీల్లో రోడ్లు మురుగు, బురదతో చిత్తడి చిత్తడిగా మారిపోతున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లపై మురుగు, బురద నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో స్థానికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి ప్రజలు వీధులోకి రావాలంటేనే ఎక్కడ కాలు జారిపడి పోతామోనని వణికిపోతున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మర్రి రామ్‌రెడ్డి కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ రోడ్లపై వర్షపు నీరు నిలబడటంతో పాటు మురుగు, బురద పేరుకుపోతుండటంతో వాహనదారులు, పాదాచారులు ప్రయాణం చేయలేకపోతున్నారు. వర్షం పడిందంటే కంటోన్మెంట్ పారిశుధ్య కార్మికుల తంటాలు అన్నీ ఇన్నీ కావు. అదే మురుగు బురదలో దిగుతూ తొలగిస్తుంటారు. కానీ మరలా వర్షం పడిందంటే చాలు షరా మాములే అన్నట్లుగా తంటాలు పడుతుంటారు.



శ్రీనివాస నగర్ కాలనీలో పేరుకుపోయిన మురుగు



మర్రి రామ్‌రెడ్డి కాలనీలో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్న కంటోన్మెంట్ సిబ్బంది

వర్షం పడినప్పుడల్లా ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యను కంటోన్మెంట్ బోర్డు అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు, నాయకులు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు, స్థానిక కాలనీ ప్రతినిధి మాల్యాద్రి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు ఎక్కడికక్కడే చేరుతోంది. నాలాలు పూడుకుపోయి మురుగు ప్రవహించే అవకాశం లేక నడిరోడ్లపై, గృహాల్లోకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది. అంతేగాక దోమలకు ఆవాసాలుగా మారడంతో విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే వర్షం ప్రవాహంలో చెత్త చెదారం వచ్చి చేరుతుండటంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నిల్వ ఉంటూ అపరిశుభ్రంగా మారుతోంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సీతారామపురం కాలనీలో నిలిచిన మురుగు

ఇబ్బందులు పడుతున్నాం



ఈ ప్రాంతంలో కాలువల్లో పూడిక సక్రమంగా తీయకపోవడంతో మురుగు ప్రవహించే వీలులేదు. దీంతో ఇళ్ల పరిసరాల్లోనే మురుగు నిల్వ ఉంటుంది. దీనివల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల పాలవున్నాం. అధికారులు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి.

- మాల్యాద్రి, కాలనీ ప్రతినిధి

బురదలో దిగాల్సిందే



ఈ ప్రాంతంలో వర్షం పడిందంటే మా కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మురుగులోనే దిగి గంటల తరబడి తొలగించాల్సి వస్తోంది. కార్మికులకు కనీస పని ముట్లు కూడా లేని దుస్థితి. ఈ ప్రాంతంలో నూతనంగా డ్రైనేజీ నిర్మాణాలు చేపడితే తప్ప సమస్య పరిష్కారం కాదు.

- ఆలీ, సూపర్‌వైజర్

ఏఐ రీసెర్చ్ ఇంజనీర్లు తయారు కావాలి

● అరోరా యూనివర్సిటీతో క్వాలిటీ థాట్ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఏఐ టాలెంట్ వార్ జరుగుతోందని, ప్రస్తుతం దేశానికి ఏఐ రీసెర్చ్ ఇంజనీర్లు చాలా అవసరమని అరోర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శ్రీలత చేపూరి, క్వాలిటీ థాట్ ఫౌండర్ రమణ భూపతి అన్నారు. అరోరా విశ్వవిద్యాలయంతో టెక్నాలజీ పార్టనర్‌గా ఉన్న ప్రముఖ సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థ క్వాలిటీ థాట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం ఉప్పల్‌లోని అరోరా డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశానికి ప్రస్తుత జనరేషన్‌కు తగ్గట్టుగా ఏఐ రీసెర్చ్ ఇంజనీర్లను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ 2025లో పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం ఒక ప్రత్యేకమైన వన్డే ప్రోగ్రామ్‌ను పరిచయం చేస్తూ బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సి.ఎస్.ఈ) అడ్మిషన్లను ప్రకటించడం గర్వంగా ఉందన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా కెరీర్ మార్గదర్శకత్వాన్ని అందించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి అవగాహన పెంచడం, అర్హులైన అభ్యర్థులకు మెరిట్ ఆధారిత స్కాలర్షిప్ అవకాశాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆలోచనాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సంబంధించిన డొమైన్లలో ఇంజనీరింగ్ అభ్యసించడానికి ఆసక్తి కలిగి ఉన్నవారిని ప్రోత్సహించనుందని వివరించారు. స్కాలర్‌షిప్ టెస్టులో పాల్గొనలేకపోయిన విద్యార్థుల కోసం ఆగస్టు 17న 2వ విడత స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహించనున్నట్లు క్వాలిటీ థాట్ వ్యవస్థాపకుడు రమణ భూపతి తెలిపారు. కార్యక్రమంలో అరోరా యూనివర్సి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరోరా యూనివర్సిటీ వీసీ శ్రీలత

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనామ్ చేసేందుకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జీఎన్ కేశవ్ విమర్శించారు. సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల విధానాలను ఎండగడుతూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎన్ కేశవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు. మతం పేరుతో బీజేపీ అధికార దాహంతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలోనే ఉండాలని, అభివృద్ధి పనుల విషయంలో ఉండకూడదని ప్రతిఒక్కరూ అభివృద్ధిపనులకు సహకరించాలన్నారు.



బదిలీపై వెళుతున్న మహిళా కానిస్టేబుల్స్‌ను సత్కరిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

మహిళా కానిస్టేబుళ్లకు సత్కారం

తిరుమలగిరి ఆగస్ట 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ జయలలిత, మంజుల బదిలీ అయ్యారు. వారిని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పౌరులకు విధి నిర్వహణలో సేవలు అందించాలని సూచించారు.

యువతి అదృశ్యం

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ స్పెషల్ కం చిల్డ్రన్ అండ్ అబ్జర్వేషన్ హోం ఫర్ గర్ల్స్‌లో ఆశ్రయం పొందుతున్న యువతి కనిపించకపోవడంతో నిర్వాహకులు మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం ప్రసన్నలక్ష్మి అనే యువతి హోంలో ఉంటూ సికింద్రాబాద్‌లోని యశోద ఫౌండేషన్‌లో జూన్ నుంచి శిక్షణ పొందుతుంది. ఎప్పటిలానే 6న శిక్షణ కేంద్రానికి వెళ్లిన యువతి అనంతరం సమాచారం ఇవ్వకుండా శిక్షణ కేంద్రం నుంచి వెళ్లిపోయింది. తిరిగి హోంకు చేరుకోకపోవడంతో హోం నిర్వాహకులు మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.



ప్రసన్నలక్ష్మి(ఫైల్)

రాఘవేంద్ర స్వామి ఆలయంలో పూర్వారాధన పూజలు

● కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు

మల్కాజిగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాఘవేంద్ర స్వామివారి 354వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మొదటిరోజున పూర్వారాధన పూజల్లో భాగంగా శ్రీరాఘవేంద్ర అష్టోత్తరపారాయణం, ఫలపంచామృతం, కనకమహాపూజ, బ్రాహ్మణ అలంకార అన్నసంతర్పణ నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారి ఆరాధనోత్సవాల్లో పాల్గొని తరించారు. సాయంత్రం మహతి డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అక్షయ అచార్, గురురాజు జోషి, మురళికృష్ణ, జయతీర్థ, నాగేష్, సుమద్వ అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గురురాఘవేంద్రుల మూలవిరాట్

గుంతల రోడ్లు.. ప్రయాణ పాట్లు

ఇబ్బందుల్లో వాహనదారులు.. ట్రాఫిక్‌కు అంతరాయం

అడ్డగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. బస్తీలో వర్షం నీరు చేరి ప్రజలు నరకయాన పడ్డారు. సికింద్రాబాద్ నుంచి జూబ్లీ బస్టాండు మీదుగా తిరుమలగిరి, అల్వాల్ వైపునకు వెళ్లే వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 8 గంటల సమయంలో వర్షం పడడంతో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ హైడ్రా అధికారులు ఆ ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. సికింద్రాబాద్ నుంచి బేగంపేట్ వైపు రాకపోకలు సాగించే మార్గంలో వాహనాలు దాదాపు రెండు గంటల ట్రాఫిక్ జాం కావడంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. కంటోన్మెంట్‌లోని బాలంరాయి, మారేడుపల్లి, డైమాండ్ పాయింట్, బోయిన్‌పల్లి మార్కెట్ రోడ్డు, అదే విధంగా సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డు, నల్లగుట్టలో వర్షానికి గుంతలు తేలి ప్రమాదకరంగా మారాయి.



సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డు



బాలంరాయి - కంటోన్మెంట్



సికింద్రాబాద్ ప్యారడైజ్



డైమండ్ పాయింట్ - కంటోన్మెంట్



నల్లగుట్ట ప్రాంతంలో..